

## సిఎంసి ప్రజావాణికి 43 అర్జీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాదాపూర్‌లోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 43 విన్నపాలు, ఫిర్యాదులు ప్రజల నుంచి అందాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులను అదనపు కమిషనర్‌లు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ గీత రాధిక, డాక్టర్ యాదగిరి రావు, చీఫ్ సిటీప్లానర్ బి. వెంకన్న, చీఫ్ ఇంజనీర్ శ్రీలక్ష్మి , విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** పారిశుద్ధ్య నిర్వహణపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం మలక్‌పేట్ సర్కిల్ పరిధిలోని చాదర్‌ఘాట్, నల్గొండ ఎక్స్‌రోడ్, శంకర్‌నగర్, చావుని, చంచల్‌గూడ తదితర ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించి పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. జెడ్‌సీ వెంట మలక్‌పేట్ డీసీ ఇంకేషఫ్ అలీ, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రుద్ర శ్రీనివాస్, ఎస్‌డబ్ల్యూఎం డీఈ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి మౌన నిరసన



**ప్రజాపక్షం/బహదూర్‌పురా :** అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆరోపిస్తూ బిజెపి నిరసన చేపట్టింది. బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయం ముందు భారతీయ జనతా పార్టీ నాయకులపై దాడులు చేస్తూ అక్రమంగా అరెస్టులు చేపట్టారని ఆరోపిస్తూ బిజెపి నేతలు మౌన నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బిజెపి జీఎస్ సురేందర్,, ప్రకాస్ గౌడ్, కునాల్ రావు, దినేష్, పవన్ మిశ్ర, నితీష్, అనిల్ బజాజ్, ముఖేష్, వేద్ ప్రకాష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా అధికారి సుధాకర్‌కు అభినందన



**ప్రజాపక్షం/నాంపల్లి:** హైదరాబాద్ జిల్లా క్రీడల అధికారి సుధాకర్ మరి కొద్ది రోజుల్లో పదవీ విరమణ చేయనున్నందున అభినంద సభ నిర్వహించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. హైదరాబాద్ జిల్లా అధికారులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ముఖ్య అతిథిగా విచ్చేయగా.. ఆత్మీయ అతిథిగా హైదరాబాద్ జిల్లా టీజీఓ అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ హాజరై సుధాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు కొట్టాజీ, ఆశన్న, పవన్, రాజేందర్, వెంకట్, జగన్నాథరావు, రోహిణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## బిసి దళ్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడిగా డి.వి.వి.సత్యనారాయణ

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** బిసి దళ్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులుగా డి.వి.వి. సత్యనారాయణను నియమించినట్టు బిసి దళ్ జాతీయ అధ్యక్షులు దుంద్ర కుమారస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యనారాయణకు ఆయన నియామకపత్రం అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ డిజిపి పూర్ణచందర్‌రావుతో కలిసి కుమారస్వామి మాట్లాడుతూ కేంద్రం బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రం చేపడుతున్న కులజనగణనలో ఓబిసి కాలమ్ పెట్టాలని డిమాండ్ చేశారు. నేటికీ సమాజంలో సాంఘిక వివక్ష కొనసాగుతుందని, అందుకు నిదర్శనం నాగర్‌కర్నూల్ ఘటనే నిదర్శనమన్నారు. దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న బిసిల అభివృద్ధికి బిసి దళ పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిసి దళ్ నేతలు పాల్గొన్నారు.

## విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి

తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ డిమాండ్

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల మూసివేతను తక్షణమే ఆపివేయాలని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కే.చక్రధర్‌రావు, కార్య నిర్వాహక కార్యదర్శి డా.కె.లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి స్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 6.5 శాతం నిధులే కేటాయించిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు విద్యావ్యాపారం చేస్తున్నవారిని విద్యావేత్తలుగా గుర్తించి వారికి పదవులు, ఎమ్మెల్సీలుగా అవకాశాలు ఇవ్వడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పాఠశాలలు మూసివేస్తున్నారని.. అన్ని ఉపాధ్యాయ సంఘాలు, నేతలు జేఏసీగా ఏర్పడి విద్యారంగ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా.. న్యాడెమక్రసీ గోవర్ధన్, మాస్‌లైన్ హన్మేష్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆర్.వెంకటరెడ్డి, డా.రాజిరెడ్డి, కె.రవిచందర్, ఎం.రఘుశంకర్‌రెడ్డి, టి.లింగారెడ్డి, తిరుపతి తదితరులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మరో బడ్జెట్‌తో ముందుకు వస్తుందని.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నాణ్యమైన విద్య పేదలకు అందడం లేదని ఆరోపించారు. విద్యారంగం విధ్వంసం అవుతుందని, మౌలిక వసతుల కల్పన కూడా పాఠశాలల్లో కనుమరుగయ్యిందని వాపోయారు. నాణ్యమైన విద్య కోసం ఈసారి బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# రౌండ్ ద క్లాక్ సేవలు

వాట్సాప్ 8712441912 ద్వారా నమోదు

1912 కాల్‌సెంటర్‌తో పాటు సేవలు అదనం

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చర్యలు

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వచ్చే 10 సర్కిళ్ల పరిధిలో 65 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 3,600 మెగావాట్స్‌గా నమోదవుతుంటే... ఈ వేసవిలో డిమాండ్ 5,000 మెగావాట్స్‌గా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లోనే రౌండ్ ద క్లాక్ విద్యుత్ వినియోగదారులకు కలిగే అసౌకర్యాన్ని పరిష్కరించేందుకు ప్రస్తుతం ఉన్న 1912 కాల్ సెంటర్‌కు అదనంగా.. వేగవంతమైన పరిష్కారం కోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఏఐ ఆధారిత వాట్సాప్ ద్వారా సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నది. ఒకే సమయంలో పెద్ద ఎత్తున వస్తున్న ఫిర్యాదులను 1912 ద్వారా నమోదు చేయలేకపోతున్నారు. దీంతో వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వాట్సాప్ 8712441912 అందుబాటులోకి రానుంది.

విద్యుత్ వినియోగదారులకు మరింత సమర్థవంతమైన, సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యుత్ సంస్థ వినియోగిస్తోంది. ఈ దిశగా వినియోగదారులు విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్ సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చు. ఈ సేవ ద్వారా వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా విద్యుత్‌కు సంబంధించిన సమాచారాన్ని వేగంగా పొందగలుగుతారు. ఇప్పటి వరకు విద్యుత్ కోతలు, సరఫరాలో హెచ్చు తగ్గులు, ఏదైనా విద్యుత్ ప్రమాదాలు, కొత్త కనెక్షన్ల జారీ వంటి అంశాలపై ఫిర్యాదుల కోసం డిస్కం 1912 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఇప్పటి వరకు ఉద్యోగులే సేవలు అందించే వారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగుల స్థానంలో మరో 20 నుంచి 25 రోజుల్లో ఏఐ ఆధారిత సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. ప్రసుతం పని చేసే ఉద్యోగులకు బదులుగా పనులన్నీ ఏఐ పని చేస్తుంది. ఇందులో భాగంగానే ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసినప్పుడు 1912 కాల్ సెంటర్‌కు ఒకే సమయంలో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతుంటాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో వచ్చిన ప్రతీకాల్‌ను రిసీవ్ చేసుకోవడం మాన్యువల్‌గా సాధ్యపడటం లేదు. అందరికీ ఒకే సమయంలో సమాధానం చెప్పడం కూడా కష్టమవుతోంది. ఇలాంటి క్లిష్టపరిస్థితులను కూడా సులభంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఉద్యోగుల స్థానంలో ఏఐ ఆధారిత సేవలను వినియోగించుకోవాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇక ఇప్పటి వరకు ఆఫీసు వేళల్లో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ తరహా సేవలు ఇకపై 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా 20 మిలియన్ యూనిట్ల డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్న నేపథ్యంలో ఏఐ ఆధారిత సేవలు కీలక భూమిక పోషించనున్నాయి.

# వృద్ధుల దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వండి



హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** పెండింగ్ అర్జీలను వేగంగా పరిశీలించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారి నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులన్నింటిని సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. వాట్సాప్ ద్వారా వృద్ధుల దరఖాస్తులకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో హౌసింగ్ శాఖకు చెందిన 189 దరఖాస్తులు రాగా వాటిలో డబుల్ బెడ్ రూం ఇండ్లకు సంబంధించినవి 15, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి 174 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూశాఖకు చెందిన 82, ఇతర శాఖలకు చెందినవి ఆరు దరఖాస్తులు కలుపుకుని మొత్తం 277 వచ్చాయి. ఈ కార్యక్రమంలో సిపిఓ డా.సురేందర్, హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, డిఆర్ఓ రామకృష్ణ, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.వెంకటి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, జిల్లా సంక్షేమశాఖాధికారులు ఆశన్న, ప్రవీణ్‌కుమార్, ఇలియాస్ అహ్మద్, కోటాజి, పరిశ్రమల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ పవన్‌కుమార్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్టిఫికెట్ల కోసం శిబిరాలు**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్ల జారీ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవడం సులభం చేయడం కోసం ఈ శిబిరాలను ఏర్పాటు చేయనున్నామని ఆమె చెప్పారు. అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ సేవను ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తహసిల్దార్లు, సంబంధిత అధికారులు మీసేవా కేంద్రాల సమన్వయంతో వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ శిబిరాలు బహదూర్ పురా జిబిహెచ్‌ఎస్ (మొఘల్‌పురా), బండ్లగూడ జిబిహెచ్‌ఎస్ పలక్‌నమా(బండ్లగూడ), చార్మినార్ జిహెచ్‌ఎస్ సిటీ మోడల్ (చాదర్ ఘాట్), గోల్కొండ జిహెచ్‌ఎస్ విజయనగర్ కాలనీ(ఆసిఫ్‌నగర్), అమీర్‌పేట జిహెచ్‌ఎస్ డికె రోడ్(అమీర్‌పేట), ఖైరతాబాద్ జిహెచ్‌ఎస్ ఎర్రమంజిల్, మారేడ్‌పల్లి వెస్లీ గర్ల్స్ హైస్కూల్ ఓల్డ్ లాన్సర్ స్కూల్ లేన్ సికింద్రాబాద్, ముషీరాబాద్ జిహెచ్‌ఎస్, సికింద్రాబాద్ జిహెచ్ఎస్ హిల్ స్ట్రీట్, హిమాయత్ నగర్ జిహెచ్‌ఎస్ (కాచిగూడ), నాంపల్లి జిహెచ్‌ఎస్ మోడల్ అలియా, సైదాబాద్ జిహెచ్‌ఎస్ మలక్‌పేట్‌లలో ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈశిబిరాలలో దరఖాస్తులు చేసుకుని సర్టిఫికెట్లు పొందవచ్చని ఆమె చెప్పారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు




**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. మార్చి నెలలో నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణపై కలక్టరేట్ సమావేశ మందిరంలో విద్య, దాని అనుబంధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలన్నింటిలో మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ తేది వరకు జిల్లాలో నిర్వహించనున్న పదోతరగతి పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 362 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో మొత్తం 78,465 మంది విదార్థులు పరీక్షలకు హాజరుకాన్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల నిల్వ, వాటిని కేంద్రాలకు పంపిణీ చేయడం, స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్‌లు, రూట్ మ్యాపింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటుపై ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారిణి రోషిణి కలెక్టర్‌కు వివరించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించరన్నారు. ఈ సమావేశంలో పోలీస్ శాఖ ఎసిపి కె.కిషన్‌రావు, ఎసిపి(ట్రాఫిక్) జి.లక్ష్మణ్, జిహెచ్‌ఎంసి అధికారి వి.నరసింహా, విద్యుత్ శాఖ డిఇ ఎపిడి సంపత్, తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి**

బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం ఐసిడిఎస్ పిఓ యూనిట్, ఎన్‌జిఒ సౌజన్యంతో ఏర్పాటు చేసిన బాల్యవివాహ విముక్తి రథంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనకు జిల్లాలో పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, స్లమ్ ఏరియాలు, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, సర్కిల్‌లలో బాల్యవివాహ నిర్మూలనపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.100రోజుల పాటు తిరిగి సంబంధిత అధికారులతో అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నాగమణి,డిసిపిఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్కుల కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ




హైడ్రా ప్రజావాణికి 59 వినతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్కు స్థలం ఉంది, స్వచ్ఛమైన గాలి, వెలుతురు, ప్రాణవాయువు అందుతుంది అనుకుంటే వాటినే రకరకాల పేరుతో మాయం చేస్తున్నారని పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. లేఔట్ వేసినప్పుడే పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ఆయా అథారిటీలకు గిఫ్ట్ డీడ్ చేసినా తర్వాత అవి ప్లాట్లుగా మారిపోతున్నాయని పలువురు వాపోయారు. లే ఔట్‌లో ఓపెన్ బావిగా ఉన్న ప్రాంతాన్ని తర్వాత మట్టితో నింపేసి బై నెంబర్లు వేసి ప్లాట్లుగా అమ్మేస్తున్నారని, పాతబస్తీ లాల్‌దర్వాజాలో ఒకప్పుడు గ్రామకంఠంగా ఉన్న 2 ఎకరాలు కబ్జాకు గురయ్యిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సికింద్రాబాద్‌లోని హస్మత్‌పేట బోయిన్ చెరువు 66 ఎకరాలుండేదని, ఇప్పుడు 30 ఎకరాలే మిగిలిందని, కబ్జాలను నియంత్రించి చెరువును కాపాడాలని నివాసితులు కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 59 ఫిర్యాదులందగా వాటిని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పరిశీలించి, పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. కొన్ని ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి త్వరలోనే వస్తామని కమిషనర్ వారికి తెలిపారు. గతంలో హైడ్రాకు ఫిర్యాదు చేయగా, తమ పార్కును కాపాడారంటూ పలువురు ప్రజావాణి కార్యక్రమానికి హాజరై కృతజ్ఞతలు తెలిపారు. పార్కును కాపాడుకున్నారంటూ తిరిగి వారినే శాలువతో రంగనాథ్ సన్మానించారు.

**సున్నం చెరువు ఎఫ్‌టిఎల్ మారదు... స్పష్టం చేసిన హైడ్రా**

మాదాపూర్‌లోని సున్నం చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టిఎల్) హద్దులు మారలేదని హైడ్రా స్పష్టం చేసింది. శాస్త్రీయంగా, పారదర్శకంగా హద్దులు నిర్ధారించి చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించింది. 2014 మేలోనే ఇరిగేషన్ శాఖ చెరువు ఎఫ్‌టిఎల్‌ను ప్రాథమికంగా నిర్ణయించిందని, అదే మేరకు పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. సున్నం చెరువు ఎఫ్‌టిఎల్ హద్దులు మార్చి అభివృద్ధి చేస్తున్నారన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణలను హైడ్రా ఖండించింది. పెద్దలను కాపాడటం కాని, పేదలకు అన్యాయం చేయటం కాని జరుగదని స్పష్టం చేసింది. కబ్జాలకు గురై 14 ఎకరాలకు తగ్గిన చెరువును, 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ధారించిన విధంగా 31 ఎకరాలకు విస్తరించినట్లు పేర్కొంది. ఇరిగేషన్, రెవెన్యూ తదితర సంబంధిత శాఖలతో కలిసి జియో కోఆర్డినేట్స్ ప్రకారం ఎఫ్‌టిఎల్ హద్దులు ఖరారు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని హైడ్రా వివరించింది. ఇటీవల చెరువును సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఇరిగేషన్ అధికారులు ఇదే విషయాన్ని స్పష్టంచేసినట్టు గుర్తుచేసింది. చెరువు ఎఫ్‌టిఎల్ హద్దులు శాశ్వతమని ప్రజలు గుర్తించాలని కోరింది.

# ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రతిరోజు చేపట్టాలి

కొంపల్లి సర్కిల్‌లో సిఎంసి కమిషనర్ సృజన పర్యటన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొంపల్లి సర్కిల్ పరిధిలో సిఎంసి కమిషనర్ జి. సృజన ఆకస్మిక పర్యటన నిర్వహించి పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, ఆస్తి పన్ను వసూళ్లు, ట్రేడ్ లైసెన్సుల జారీ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పలు ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆమె, గుర్తించిన లోపాలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికులు ప్రతి రోజూ తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించేలా వార్డు స్థాయిలో మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ తెలిపారు.

**ఆస్తిపన్ను వసూళ్లలో పురోగతి సాధించాలి..**

వాణిజ్య సంస్థల వద్ద ట్రేడ్ లైసెన్సుల జారీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, ఆస్తి పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలని కమిషనర్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. పెండింగ్ బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, డిజిటల్ పద్ధతుల ద్వారా పన్నుల చెల్లింపును ప్రోత్సహించాలని సూచించారు. పన్నుల చెల్లింపులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ప్రజావాణికి 59 అర్జీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 59 అర్జీలు అందాయి. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 42 విన్నపాలు, ఫిర్యాదులు రాగా, ఆరు జోన్ల పరిధిలో 17 అర్జీలు వచ్చాయి. ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.సత్యనారాయణ, ఏఎస్‌పి నరసింహారెడ్డి, జాయింట్ కమిషనర్లు జయంత్, రజనీకాంత్ రెడ్డి, సిటీ ప్లానర్ ఉమాదేవి పాల్గొన్నారు.

## మల్కాజిగిరి నగర పాలకసంస్థలో ప్రజావాణి

బ్యాంకు లింకేజ్ లక్ష్యాలు చేరుకోవాలి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు. మొత్తం 25 ఫిర్యాదులు నమోదు కాగా, పట్టణ ప్రణాళికా విభాగానికి 13, ఇంజనీరింగ్ విభాగానికి 9, పరిశుభ్రత, వీధి దీపాలు, ఏంటమలాజీ విభాగాలకు తలా ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంక్ లింకేజ్ లక్ష్యాలు చేరుకోవాలని ఆదేశించారు. నైట్ షెల్టర్ల నిర్వహణపై సమీక్షించి, ప్రధాన కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పొదుపు సంఘాల మహిళలతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## హైదరాబాద్‌లో విడిచిపెట్టిన వాహనాల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని రోడ్లు, రహదారుల పక్కన వదిలేసిన వాహనాల కారణంగా చెత్త పేరుకుపోవడం, దోమల పెరుగుదలతో పాటు నగర అందం దెబ్బతింటున్న నేపథ్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి ) ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని 14 సర్కిళ్లలో డిప్యూటీ కమిషనర్లు సంబంధిత ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని, రోడ్ల పక్కన విడిచిపెట్టిన వాహనాలను తొలగిస్తున్నారు. అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) సి.ఎన్. రఘుప్రసాద్ ఉదయం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పరిస్థితులతో పాటు వాహనాల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షించారు. సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో మొత్తం 89 వాహనాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. జోన్ వారీగా తొలగించిన వాహనాల సంఖ్య ఈ విధంగా ఉంది. మల్కాజిగిరి జోన్ కీసర – 3, అల్వాల్ – 4, బోవెన్‌పల్లి – 11, మౌలా అలీ – 13, మల్కాజిగిరి – 8, ఘట్‌కేసర్ – 3, ఉప్పల్ జోన్ కప్రా – 4, నాచారం 0, ఉప్పల్ – 23, బోడుప్పల్ – 10, ఎల్.బి.నగర్ జోన్ నాగోల్ – 3, సరూర్ నగర్ – 3, ఎల్.బి. నగర్ – 2, హయత్‌నగర్ – 2. నగర ప్రజలు తమ వాహనాలను రోడ్ల పక్కన వదిలేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని అధికారులు సూచించారు. భవిష్యత్తులో కూడా ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

## నాపై దుష్ప్రచారం తగదు

శిల్పి ఎం.వి.రమణారెడ్డి



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** ప్రభుత్వ కార్యక్రమాల రూపకల్పనలో తోడ్పాటు అందిస్తున్న తన లాంటి శిల్పి, కళాకారుడిపై దుష్ప్రచారం చేయడం తగదని శిల్పి ఎం.వి.రమణారెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపడుతున్న మహాత్మాగాంధీ విగ్రహం స్థల విషయంలో ఒక అపార్ట్‌మెంట్ భూసేకరణ గురించి తనపై ఒక పత్రిక, చానల్, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అసలు ఆ వివాదంలో తనకు సంబంధం లేదన్నారు. ఒకవేళ ప్రభుత్వం విగ్రహం డిజైన్ విషయంలో తన సహకారం కోరితే తాను తప్పకుండా సహకరిస్తానని తెలిపారు. తనపై ఇకనైనా దుష్ప్రచారం ఆపకపోతే సదరు సంస్థలపై ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

## వైద్యం కోసం వచ్చి కుప్పకూలాడు

**ప్రజాపక్షం/కొందుర్గు:** వైద్యం చేయించుకునేందుకు వచ్చిన వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని రేగడి చిల్కమర్రి గ్రామానికి చెందిన నర్సింలు (40) అనే వ్యక్తి సోమవారం ఉదయం కడుపు నొప్పితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని లోపలికి వెళ్తుండగా ఉన్నఫలంగా ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయాడు. ఆసుపత్రి నుండి వైద్యులు వచ్చి చూసే సరికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కొందుర్గు పోలీసులకు సమాచారం అందించి అంబులెన్స్‌లో మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాల మార్చరీకి తరలించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
24-02-2026
www.prajapaksham.in

‘ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) 2026 డైరీని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు నేతృత్వంలో మా సభ్యులు భట్టిని కలిశారు. ఈ కార్యక్రమంలో విష్ణు, శివబాలాజీ, మాణిక్ తదితరులు పాల్గొన్నారు. ’

రీల్

# ‘మా’ డైరీని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి



‘మా’ (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) నూతన డైరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ‘మా’ అధ్యక్షుడు మంచు విష్ణు రిలీజ్ చేయించారు. మా సభ్యుల కోసం చేపడుతున్న ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, హెల్త్ చెకప్‌లు, సభ్యుల సంక్షేమం కోసం మా కార్యవర్గం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. సోమవారం ఉదయం ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ‘మా’ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి, ట్రెజరర్ శివ బాలాజీతో పాటుగా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ జయవాణి, మలక్‌పేట్ శైలజ, శివ నారాయణ, శశాంక్, హరనాథ్ బాబు, మానిక్, సంపూర్ణేశ్ బాబు, ఎం.ఆర్.సి. వడ్లపట్ల తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ‘మా’ నూతన డైరీని ఆవిష్కరించి.. అధ్యక్షుడు మంచు విష్ణు, కార్యవర్గ సభ్యులను అభినందించారు.


# ‘ఆరా ఆఫ్ ఉస్తాద్’ పాట విడుదల



పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’. మార్చి 26న థియేటర్లలో అడుగుపెట్టనున్న ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ నుంచి ఇప్పటికే విడుదలైన తొలి గీతం ‘దేఖ్లేంగే సాలా’ విశేషంగా ఆకట్టుకుంది. వింటేజ్ పవర్‌స్టార్‌ను ఆవిష్కరించిన ఈ పాట చార్ట్ బస్టర్ గా నిలిచింది.ఇప్పుడు ‘ఉస్తాద్ భగత్ సింగ్’ నుంచి రెండవ గీతంగా ‘ఆరా ఆఫ్ ఉస్తాద్’ విడుదలైంది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్లోని మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ లో ఈ గీతావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. పవర్‌స్టార్ ఆరాను ప్రతిబింబించేలా ఈ గీతముంది. నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే అనే లైన్ కేవలం పవర్‌ఫుల్గా వినిపించడమే కాదు.. అది పవర్ స్టార్ ఆరాలోని అసలైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ఇక ఒక సంజ్ఞ యొక్క ప్రభావాన్ని, ఒక కదలిక యొక్క బరువును మరియు అభిమానుల్లో రేకెత్తించే ఉత్సాహాన్ని అద్భుతంగా చూపిస్తుంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ మరోసారి తన సంచలనాత్మక, హైవోల్టేజ్ కూర్పుతో అంచనాలను పెంచేశారు. మాస్ ఎనర్జీతో నిండిన ఈ సంగీతం ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుంది. చంద్రబోస్ రాసిన శక్తివంతమైన సాహిత్యం పవన్ కళ్యాణ్ చరిష్మాను సంపూర్ణంగా ప్రతిబింబిస్తుంది. ‘ఆరా ఆఫ్ ఉస్తాద్’ గీతావిష్కరణ వేడుకలో దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ. ‘ఈ పాటకు’ ఆరా ఆఫ్ ఉస్తాద్’ అని ఏ ముహూర్తాన పెట్టామో.. ఇక్కడున్న ప్రతి ఒక్కరిలో ఆ ఆరా కనిపిస్తుంది. ’నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే’. సినిమాలో ఒక సన్నివేశంలో ఈ డైలాగ్ వస్తుంది. పవన్ కళ్యాణ్ గారు రెండు దశాబ్దాల నుంచి ఈ మేనరిజమ్ చేస్తున్నారు. దీనికి మాట రూపంలో చెప్తే బాగుంటుంది అనిపించింది. ఆ ఆలోచన నుంచి ఈ డైలాగ్ వచ్చింది. ఆ ఆరాకి ఖచ్చితంగా ఆస్కార్ కలమే కావాలి అనిపించింది. వెంటనే చంద్రబోస్ గారిని కలిసి ఈ పాట గురించి చెప్పాము. కేవలం ఎనిమిది గంటల్లో పాట సిద్ధమైంది అని గేయ రచయిత చంద్రబోస్ అన్నారు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, ప్రీతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాక్షన్ నేపథ్యంలో డకోయిట్

అడవి శేష్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం డకోయిట్. యాక్షన్ నేపథ్యంలో నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ సాంగ్‌ను ఈనెల 27న విడుదల చేయనున్నారు. రుబారూ అనే పాటను విడుదల చేయనున్నారు. యాక్షన్, తీవ్రవాదులను అధచివేసే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటివరకు అడవీశేష్ చేయని పాత్రను ఇందులో చేస్తున్నారని నిర్మాత సుప్రియ యార్లగడ్డ చెప్పారు. ఒక హాలీవుడ్ సినిమా స్థాయిలో నిర్మించామని చెప్పారు. కామాక్షి భాస్కర్, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు భీమ్స్ సిసి రిలియో సంగీతం అందిస్తున్నారు.




# మార్చి 6న వస్తున్న ‘కాక్రోచ్’




సొంత ఊరు, గంగపుత్రులు, ఒక రొమాంటిక్ క్రైమ్ కథ, గల్ఫ్, వలస వంటి చిత్రాలతో అవార్డులు, ప్రేక్షకుల రివార్డులు అందుకున్న డైరెక్టర్ పి. సునీల్ కుమార్ రెడ్డి రూపొందిస్తున్న తాజా చిత్రం ‘కాక్రోచ్‘. ఈ చిత్రంలో అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ‘కాక్రోచ్‘ సినిమాను శ్రీ లక్ష్మి పిక్చర్స్ బ్యానర్ పై బి.బాపిరాజు, ముతుకి నాగసత్యనారాయణ నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా మార్చి 6న థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రెస్‌మీట్‌ను హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బి.బాపిరాజు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న ఘటనలకు వాస్తవిక రూపంగా ఈ సినిమాను నిర్మించాం. ఈ చిత్ర నిర్మాణ సమయంలో కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నాం. సహజమైన లొకేషన్స్ లో రిస్కీ షూటింగ్ కానీ చేశాము. సెన్సార్ వారు మా మూవీకి ‘ఎ’ సర్టిఫికెట్ ఇచ్చారు. మార్చి 6వ తేదీన మా మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం అన్నారు.
డైరెక్టర్ పి.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... విశాఖ, గాజువాక ప్రాంతంలో ఉండే కొందరు నేరస్తుల నిజ జీవిత ఘటనల ఆధారంగా ఒక వయలెంట్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. వేల కోట్ల రూపాయల మోసాలు చేసేవారిని వదిలేసే ఈ వ్యవస్థ, చిన్న చిన్న దొంగతనాలు చేసేవారి మీద ప్రతాపం చూపిస్తుంటుంది. మురికి కుప్పాలలో ఉన్న నేరస్థుల జీవితాల్లోని అనుభవాలు, ప్రేమలు నాకు చాలా విచిత్రంగా అనిపించాయి. అడ్డరోడ్డు మీద ఉండే వేశ్యకు, ఒక క్రిమినల్‌కు మధ్య జరిగే ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో ఈ చిత్రాన్ని రూపొందించాను. అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ, మీనాక్షి, రామన్, బుగత, అంజి, ప్రదీప్, సముద్రం వెంకటేశ్, మల్లిక, ఎఫ్.ఎమ్. బాబాయ్, తాటికొండ ప్రసాద్, సునీత, రాజు, బాలాజీ, ఎల్ బీ రమణ, నటించారు.

# చిరంజీవికి ఘన సన్మానం

మెగాస్టార్ చిరంజీవి బిగ్గెస్ట్ రీజినల్ బ్లాక్ బస్టర్ ‘మన శంకర వర ప్రసాద్ గారు’ సెలబ్రేషన్స్ కొనసాగుతున్నాయి. చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా తాజాగా కె.వి. రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చిరంజీవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కొణిదెలతో పాటు కె రాఘవేంద్రరావు, సి. అశ్వనీదత్, అల్లు అరవింద్, సురేష్ బాబు, ఎ.కోదండరామిరెడ్డి, బి గోపాల్, వి వి వినాయక్, బాబీ, బుచ్చిబాబు సానా, బండ్ల గణేష్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు, పలువురు సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. మన శంకర వర ప్రసాద్ గారు సంక్రాంతి సందర్భంగా థియేటర్లలో అద్భుతాలు సృష్టించి ప్రపంచ వ్యాప్తంగా 400 కోట్లకు పైగా వసూళ్లతో బిగ్గెస్ట్ రీజినల్ హిట్గా నిలిచింది. చిరంజీవి కెరీర్ లో 400 కోట్లు కలెక్ట్ చేసిన తొలి చిత్రంగా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది.



# ఏప్రిల్‌లో రానున్న అరుణాచల గిరిప్రదక్షిణ




‘ఆటగదరా శివా‘ అం టూ శివతత్వాన్ని ఆవిష్కరించిన ప్రముఖ నటుడు రచయిత దర్శకుడు తనికెళ్ళ భరణి సుప్రసిద్ధ మహిమాన్విత పుణ్యక్షేత్రం అరుణాచలం నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ‘అరుణాచల గిరి ప్రదక్షిణ’ చిత్రం ఫస్ట్ గ్లిమప్స్ విడుదల చేశారు. భీమవరం టాకీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వి.ఎఫ్.ఎక్స్‌లో సిద్ధహస్తుడైన యువ ప్రతిభాశాలి హర్ష. ఎం. దర్శకత్వం వహిస్తుండగా.మ సంగీతద్వయం డా.ఎ.జె.సంధ్య వర్షిణి, డా.వి.ఆర్.ఎ. ప్రదీప్ సంగీతం సమకూర్చుతున్నారు. ఈ చిత్రం కోసం స్వరపరిచిన ఓ గీతానికి చింతల శ్రీనివాస్ సాహిత్యం సమకూర్చగా మధు గాత్రం అందించారు. మదర్ సెంటిమెంట్ తోపాటు బలమైన భావోద్వేగాలతో రూపొందుతున్న ‘అరుణాచల గిరి ప్రదక్షిణ‘ అద్భుత విజయం సాధించాలని తనికెళ్ళ కోరుకున్నారు. షూటింగ్ రెండో షెడ్యూలు అతి త్వరలో ప్రారంభమవుతుందని, ఏప్రిల్ లో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత రామసత్యనారాయణ తెలిపార.



# కుమ్మెర ఘటన నిందితులపై చర్యలు తీసుకోవాలి

## డిజిపిని కలిసిన బిసి జెఎసి నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో దాడి ఘటనలో రెండు నెలల పాప మృతికి కారకులైన నిందితులపై చర్యలు తీసుకోవాలని బిసి జెఎసి నేతలు సోమవారం డిజిపి బి.శివధర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..కుమ్మెర ఘటనలో అగ్రకుల అహంకారంతో బిసి,దళిత కుటుంబంపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. ఘటనపై హత్య కేసుతో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కుల ఆధారిత దాడులు, దురంకార హత్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే కుమ్మెర ఘటన నిందితులకు కఠిన శిక్షలు విధించాలని ఆయన తెలిపారు. బాధితులైన గణేష్, చంద్రకళ కుటుంబానికి ప్రభుత్వం కనీసం రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని కూడా వారు కోరారు. ఈ కేసులో సంబంధం ఉన్న వారందరిపై రాజకీయ ఒత్తిడులకు లోనుకాకుండా నిష్పక్షపాత విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని డిజిపిని కోరామన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని డిజిపి శివధర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బిసి రజక కుటుంబానికి న్యాయం జరిగే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. డిజిపిని కలిసిన వారిలో నేతలు గుజ్జకృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా డిజిపిని కలిసి ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# రేపు ‘రైల్ పార్శిల్ యాప్’ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్: రైల్వే పార్శిల్ సేవలను డిజిటల్ దిశగా విస్తరించేందుకు దక్షిణ మధ్య రైల్వే ముందడుగు వేసింది. రైళ్ల ద్వారా పార్శిల్ పంపించే వినియోగదారులకు ఇంటివద్దకే బుకింగ్, డెలివరీ సౌకర్యం కల్పించే లక్ష్యంతో భారతీయ రైల్వేలలో తొలిసారిగా ‘రైల్ పార్శిల్ యాప్’ను పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టనుంది. ఈ యాప్‌ను ఈ నెల 25న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నారు. రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరవుతారు. భారతీయ రైల్వేలో ఈ వినూత్న ప్రాజెక్ట్ అమలు చేస్తున్న తొలి డివిజన్‌గా హైదరాబాద్ డివిజన్ నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.
‘రైల్ పార్శిల్ యాప్’ ఫస్ట్ మైల్ (పికప్), మిడ్ మైల్ (రైల్వే రవాణా), లాస్ట్ మైల్ (డెలివరీ) సేవలను ఒకే డిజిటల్ వేదికలో అనుసంధానించే సమగ్ర ప్లాట్‌ఫామ్‌గా పనిచేస్తుంది. ఆన్‌లైన్ బుకింగ్, డిజిటల్ చెల్లింపులు, రియల్ టైమ్ ట్రాకింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. పార్శిల్ హ్యాండ్లింగ్ ప్రతి దశలో వినియోగదారుల మొబైల్‌కు ఆటోమేటెడ్ సందేశాలు చేరే విధంగా వ్యవస్థ రూపుదిద్దుకుంది.అదే కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరుతో అవగాహన ఒప్పందం (ఎంఒయూ)పై సంతకం చేయనున్నారు. ఫ్రైట్ లాజిస్టిక్స్ మార్కెట్‌పై సమగ్ర అధ్యయనం చేసి, జోన్ వ్యాప్తంగా రైల్వే సరుకు రవాణా వాటాను పెంచేందుకు డివిజన్ వారీ వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేయడం ఈ భాగస్వామ్య లక్ష్యం. డిజిటల్ సాంకేతికత ఆధారంగా పార్శిల్ సేవలను ఆధునీకరించే ఈ చర్య రైల్వే ఆదాయాన్ని పెంచడంతో పాటు పరిశ్రమలు, వ్యాపారులు, వ్యక్తిగత వినియోగదారులకు ఎండ్ టూ ఎండ్ లాజిస్టిక్స్ పరిష్కారాన్ని అందించనుంది.

# ‘రెడీ టూ వర్క్ ఫోర్స్’గా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతాం

## ‘ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్’ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను ‘రెడీ టూ వర్క్ ఫోర్స్’గా తీర్చిదిద్దడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అందుకోసం... నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ బీమా దిగ్గజం హార్ట్ ఫోర్డ్ 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1200 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ‘ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్’ను ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఐటి మాత్రమే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఏరోస్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫిన్ టెక్, డీప్ టెక్, రిటైల్ తదితర రంగాల్లోనూ హైదరాబాద్‌ను ‘గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్’గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ విస్తరణలో భాగంగా రెండు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన హార్డ్ ఫోర్ట్ హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం ఇక్కడి ప్రతిభకు, డిజిటల్ ఇంజనీరింగ్‌లో మన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎఐ, రిస్క్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఆధునిక బీమా రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు. నగరంలో ఇప్పటికే 400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జిసిసి) సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో మారియట్, మెక్‌డొనాలడ్స్ యూబీఎస్, డాజన్, వాన్‌గార్డ్ ఎలీ లిల్లీ, హెచ్ సిఎ హెల్త్ కేర్, సిటిజన్స్ బ్యాంక్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. వీటిని కేవలం బ్యాక్ ఎండ్ ఆపరేషన్స్‌కు మాత్రమే పరిమితం చేయకుండా... గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా మార్చేలా అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పారదర్శక పాలన, సమర్థవంతమైన నాయకత్వం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు, ఆధునిక డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి తదితర అంశాలు హార్ట్ ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా ఎంచుకునేందుకు దోహదపడుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ కార్యాలయం యూఎస్ లోని హార్ట్ ఫోర్డ్ చికాగో, షార్లెట్, కొలంబస్ లో ఉన్న టెక్నాలజీ కేంద్రాలకు అనుబంధంగా పని చేస్తూ... ఎఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ డెవలప్ మెంట్ పై దృష్టి సారిస్తూ ‘ఇంజనీరింగ్ ఎక్స్ లెన్స్ హబ్’గా పని చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో హార్ట్ ఫోర్డ్ ప్రెసిడెంట్ మోరిస్ టూకర్, చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఆఫీసర్ క్లైర్ బర్న్స్ సిఐఒ శేఖర్ పన్నాల, హార్ట్ ఫోర్డ్ ఇండియా ఎండి సూర్య తమ్మిరాజు, సిటిఒ ఇమ్రాన్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



# కిమ్ తిరిగి ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

సైనికులకు ఉన్న అంచలమైన విశ్వాసాన్ని డబ్ల్యుపికె ఉటంకించింది. దాడులు జరిగితే అణు ఆధారిత యుద్ధాన్ని నియంత్రించేందుకు కిమ్ జోంగ్ నాయకత్వ పటిమ, ఆయన శక్తిసామర్థ్యాలు దేశానికి ఎంతో అవసరం అని పార్టీ పేర్కొంది. దేశ సైనికశక్తిని బలోపేతం చేయడంలో కిమ్ పాత్రను ప్రశంసిస్తూ ఆయనను పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకున్నట్లు తెలిపింది. పార్టీ అభివృద్ధి, దేశ శ్రేయస్సుకు ఈ ఎన్నిక అనివార్యమైనదని పార్టీ పేర్కొన్నట్లు యోన్‌హాప్ ఏజన్సీని ఉటంకిస్తూ కెసిఎన్ఏ తెలియజేసింది. రాబోయే ఐదు సంవత్సరాలకుగాను ఆర్థిక,రక్షణ,దౌత్య రంగాలలో ఉత్తర కొరియా సంప్రదాయక విధాన దిశామార్గాన్ని నిర్దేశించేందుకు జరుగుతున్న సమావేశాల్లో నాలుగోరోజున కిమ్ ఎన్నిక జరిగింది. ఎలాంటి దురాక్రమణ ముప్పునైనా ఎదుర్కోగల శక్తిసామర్థ్యాలున్న విప్లవ సైనిక దళాన్ని దేశంలో నిర్మించినందుకు కిమ్ జోంగ్ ఉన్‌కు పార్టీ ప్రశంసించింది. అదేవిధంగా అంతర్జాతీయ అంక్షలు, బాహ్యంగా అతిపెద్ద ఒత్తిడి ఎదురవుతున్నప్పటికీ, అణ్వాయుధ దళాలతో కేంద్రీకృతమైన యుద్ధ నిరోధకశక్తి దేశంలో ఎంతోబాగా మెరుగుపడిందని పార్టీ కాంగ్రెస్ ఆయనకు ప్రశంసలు ఇచ్చింది.వర్కర్స్‌పార్టీ ఆఫ్ కొరియా కార్యదర్శి ఇల్‌హ్యాన్ తొలుత మాట్లాడుతూ, దేశ శ్రేయస్సును కోరుతూ, స్థిరమైన అభివృద్ధివైపు అందరినీ నడిపించగల శక్తిసామర్థ్యాలున్న నాయకుడిగా కిమ్‌ను అభివర్ణించారు. సవరించిన పార్టీ నియమ నిబంధనావళిని కూడా మహాసభ ఆమోదించింది. ఈ సవరణలు ఏమిటనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు. కిమ్ నాయకత్వాన్ని ఏకీకృతం చేయడంపై మహాసభ దృష్టిసారించింది.

# నిధులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఒక లక్షా 06 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడడంతో పనులు మందగించాయని వివరించారు. అవాంతరాలను అధిగమించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వరద కాలువల ద్వారా వచ్చే నీటితో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరెల్లి గ్రామంలో 1.41 టి.ఎం.సిల నీటితో ఈ రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రతిపాదించగా అంచనాలు సవరించి 8.23 టిఎంసిల సామర్థ్యానికి పెంచి అదనపు ఆయకట్టు సేద్యంలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని, సవరించిన ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు పెట్టమని ఆయన తెలిపారు. అనేక అవాంతరాలతో అర్ధాంతరంగా నిలిచి పోయిన గౌరెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని వైపులా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక పై నిధుల కేటాయింపులలో కూడా ఎటువంటి అలసత్వానికి అవకాశం లేకుండా, ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటు త్వరితగతిన ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు.

**భూసేకరణను వేగవంతం చేయండి: పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గౌరెల్లి ప్రాజెక్టు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. దేవాదుల,గౌరెల్లి తో సహా నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను పూర్తి చేయాలన్నారు. పట్టణీకరణ వేగవంతంగా పెరుగుతున్నదని, దీంతో భూముల ధరలు కూడా పెరగడంతో రైతులు పెద్ద మొత్తంలో నష్టపరిహారాన్ని కోరుకుంటున్నారని,దీనికి సంబంధించిన విధాన నిర్ణయాలు న్యాయపరంగా తీసుకోవాలని పొన్నం సూచించారు.

# మెక్సికో డ్రగ్ లార్డ్ ఎల్‌మెంచో హతం

## అనేక రాష్ట్రాలలో హింస, మరణాలు



టపాల్పా: మెక్సికో కేంద్రంగా అంతర్జాతీయస్థాయి అక్రమ మాదకద్రవ్యాల నాయకుడు, మెక్సికో కేంద్రంగా అవినీతి, అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న డ్రగ్‌లార్డ్ ఎల్ మెంచో (59) భద్రతా దళాల కాల్పుల్లో హతమయ్యాడు. సైన్యం ఆపరేషన్ సందర్భంగా జరిగిన పోరాటంలో అనేకమంది సైనికులు గాయపడ్డారు. జాలిస్కోలోని టప్పాలా పట్టణంలో సైన్యం నిర్వహించిన ఆపరేషన్‌లో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. అతడితోపాటు మరో ఇద్దరు డ్రగ్‌లార్డ్స్ కోసం అమెరికా–మెక్సికో దేశాలు చాలాకాలంగా తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో, వ్యవస్థీకృత నేరాలలో ఎల్‌మెంచో పేరుమోసిన నేరస్థుడు. అంతర్జాతీయంగా అతడికి నెట్‌వర్క్ ఉంది. ఈ ముగ్గురు డ్రగ్ లార్డ్స్ఆచూకీ చెప్పినవారికి కోట్ల డాలర్ల నగదు బహుమతులు ఇస్తామని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. అతడి అసలు పేరు నెమెసియో ఒసేగురా సెర్వంటెస్. జలిస్కోలోని న్యూ జనరేషన్ డ్రగ్ కార్టెల్ అగ్రనాయకుడు ఎల్‌మంచో. భద్రతా దళాలు అతడిని హతమార్చడంపట్ల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. అతడి మరణం అక్రమ మాదక ద్రవ్యాల రవాణా ముఠాలపై చేస్తున్న పోరాటంలో అతిముఖ్యమైన విజయమని సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. అతడి మరణవార్త తెలిసిన వెంటనే మెక్సికో వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో నగరాల్లో అతడి అనుచరులు అల్లర్లకు పాల్పడ్డారు. హింస సృష్టించారు. రోడ్లను స్తంభింపజేశారు. దీంతో ప్రజలు భయాందోళన చెందారు. వీధుల్లో చాలాచోట్ల ప్రజలు తిరగలేదు. అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలు విద్యాలయాలకు సెలవులు ప్రకటించాయి. అల్లర్లలో అనేక మంది మరణించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com